మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
ఆదివారం | 30 | ఏప్రిల్ | 2023 | పేజీలు : 5



# అమ్యామ్యాల చిట్టాలోని సిట్టింగ్ లెవరు..?

### 35 మందిలో జిల్లా నేతలున్నారా..?

### కెసిఆర్ వ్యాఖ్యలతో సర్వత్రా చర్చ

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 29 (మనం న్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తోన్న సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి అ మ్యామ్యాలు స్వీకరిస్తోన్న మంత్రులు, ఎమ్మె ల్యేల చిట్టా తన వద్ద ఉందని, వారి తోక కత్తిరిస్తామని స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరా బాద్‌లో జరిగిన పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో కెసిఆర్ ఈ రకంగా హెచ్చరి కలు జారీ చేయడం ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణు ల్లో కలకలం రేపింది. ఇప్పటికైనా తీరు మా ర్చుకోకపోతే సహించేది లేదని పేర్కొంటూ, పలువురు ఎమ్మెల్యే పనితీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తోన్న దళిత బంధు, కళ్యాణ లక్ష్మి తదితర పథకాల లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకుంటోన్న 35 మంది చిట్టా తన వద్ద ఉందని, వారికి రాబోయే ఎన్నికల్లో టికెట్లు కేటాయించేది లేదన్న సంకేతాలిచ్చినట్లు సమాచారం. స్వయంగా ఎమ్మెల్యేలు అమ్యామ్యాల ప్రక్రియలో పాల్గొనకపోయినా వారి అనుచర వర్గం ఈ తతంగాన్ని నడిపిస్తున్నా, వారే బాధ్యులవుతారని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ భాగోతంలో ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిన వారెవరు..? కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులున్నారా..? ఒక వేళ ఉంటే వారి పరిస్థితి ఏమిటి..? 35 మంది జాబితాలో మన జిల్లా వారెందరున్నారు..? అనే చర్చ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. సిఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బంధు పథకాన్ని మొట్టమొదటి సారిగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ప్రారంభించారు. తదనంతరం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఈ పథకం ప్రయోజనాలు సక్రమంగానే ఉన్నప్పటికీ లబ్ధిదారుల ఎంపిక విషయంలో పలు ఆరోపణలు చోటుచేసుకుంటున్నాయి. బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారికే ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని, పలు సందర్భాల్లో ఆరోపణలు వినిపించాయి. ప్రతి లబ్ధిదారునికి పది లక్షల రూపాయలను అందిస్తోన్న ఈ పథకంలో ప్రయోజనం పొందే వారి నుంచి రెండు నుంచి మూడు లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇదే విషయాన్ని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించడం, అలాంటి వారి తోకలు కత్తిరిస్తానని హెచ్చరికలు జారీ చేయడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో ఇదే తతంగం కరీంనగర్ జిల్లాలో కూడా కొనసాగిందా..? ఏయే నియోజకవర్గాల్లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాయి అనే చర్చ సర్వత్రా సాగుతోంది.



# ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలి

### రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్



కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 29 (మనం న్యూస్)ః తప్పులకు ఆస్కారం లేని ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించా లని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంయుక్త ఎన్నికల అధికారి రవికిరణ్ సూచించారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, హుజురా బాద్ చొప్పదండి అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధి కారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో జరగనున్న ఎన్నికలు సజావుగా జరగాలంటే ఈవియంల కన్న ముందు ఓటరు జాబితా స్పష్టంగా ఉండాలని, ఖచ్చిత్తమైన ఓటరు జాబితాను రూపొం దించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో కృషిచేయాలన్నారు. ఓటరు జాబితా నుండి చనిపోయిన, వలసపోయిన ఓటర్ల వివరాలను తొలగించడంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరిం చాలని, ఓటరు చనిపోయిన క్రమంలో అతని మరణ ధృవీకరణ ఆధారంగా గాని, దృవీకరణ లేనట్లయితే వారి కుటుంబ సభ్యు ల ద్వారా ధృవీకరణను పొందాలని తెలిపారు. అదే విధంగా బిఎల్ఓలు సర్వేకు వెళ్లిన సమయంలో ఓటర్ జాబితాలో ఉన్న వారు ఇంటివద్ద లేకపోవడంతో వారిని వలసవెళ్లిన వారిగా భావించరాదని, వారికి రిజిష్టరు పోస్టు ద్వారా లేఖపూర్వకంగా తెలియజేసిన తరువాతే జాబితా నుండి తొలగించాలన్నారు. మే 15 లోగా డెలిషన్ నివేదికను అందించాలని తెలిపారు. జాబితా నుండి తొలగించిన వారి వివరాలను తిరిగి నమోదు చేసేటప్పుడు ఖచ్చితమైన దృవీకరణలను ఆధారంగా తీసుకోవా లని సూచించారు. ఓటరుగా గుర్తింపు పొందిన వారందరికి ఎ పిక్ కార్డులను అందించాలని, ఒకే చిరునామాతో నమోదైన వా టిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, మార్పులు చేపట్టాలని తెలిపారు. డాటా ఎంట్రిలో ఎర్పడే సాంకేతిక సమస్యలను తెలియజేయా లన్నారు.. ప్రతి వారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పొలిటికల్ కో ఆర్డినేషన్ సమావేశమును నిర్వహించి జాబితాలో చేపట్టిన సవరణలపై అభ్యంతరాలను స్వీకరించాలని, సమావే శం అనంతరం వివరాలను భద్రపరచాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలో ప్రైవేటు సిబ్బందిని ఎన్నికల విధులకు వినియోగిం చరాదని, ప్రతివారం సిఈఓ పోర్టల్ లో వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల అధికారి హమిద్, అదనపు కలెక్టర్లు జి.వి. శ్యాంప్రసాద్ లాల్, గరిమా అగర్వాల్, పిడి డిఆర్డిఓ శ్రీలత, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డిఓలు ఆనంద్ కుమార్, హరిసింగ్, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



## త్రాగునీటి సమస్యను పరిష్కరించండి

### 1వడివిజన్‌బిజెపి కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్



కరీంనగర్ ,ఏప్రిల్ 29( మనం న్యూస్): కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో త్రాగునీటి కోసం శాశ్వత ప్రాతిపదికన కొత్త పైపు లైన్ నిర్మాణం చేపట్టాలని ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి బిజెపి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ కోరారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియం లో జరిగిన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన తీగలగుట్టపల్లి లో మంచినీటి పైప్ లైన్ పనులను త్వరగా పూర్తిచేసి త్రాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజల తాగునీరు అవసరాలను తీర్చే విధంగా శాశ్వత ప్రాతిపదికన కొత్త పైపులైన్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా అమృత్ పథకం కింద వచ్చే నిధుల ద్వారా విలీన గ్రామాలలో మంచినీటి కొత్త పైపులైన్ ప్రతి గల్లీ మీదుగా వెళ్లే విధంగా తక్షణం పనులు ప్రారంభించే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తీగల గుట్టపల్లి స్టేజి నుండి రెవెన్యూ కాలని రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం తో పాటు సిసి రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని సర్వసభ్య సమావేశంలో విజ్ఞప్తి చేశారు.

## మేడే వారోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



ఇల్లంతకుంట, ఏప్రిల్ 29 (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ముస్కాన్ పేట గ్రామంలో శనివారం జరిగిన కార్యక్రమంలో హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు సావనపల్లి రాములు మేడే వారోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే రోజున గ్రామ గ్రామాన కార్మికులందరూ జెండా ఎగురవేసి, సిరిసిల్లలో సాయంత్రం నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీ బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు స్వామి, రాజు, అంజి, నర్సయ్య, రమేష్, కనుకయ్య, లచ్చయ్య, పరుశురాం, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి కారు బోల్తా



ముత్తారం,ఏప్రిల్ 29 మనం న్యూస్ : ముత్తారం మండల కేంద్రం నుండి ఓడేడు గ్రామానికి వెళ్లే ఇసుక క్వారీ మూలమలుపు వద్ద ఓడేడు గ్రామానికి చెందిన కారు అదుపుతప్పి బోల్తా కొట్టి రోడ్డు కింద ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

# సీఎం కేసీఆర్ మాటల వరకే పరిమితం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సెగ్గం రాజేష్

### కార్యదర్శిల సమ్మెకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం

మంథని,ఏప్రిల్ 29 మనం న్యూస్ : మంథని పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు రెండు రోజుల నుండి పంచాయితీ కార్యదర్శిలు చేస్తున్నా సమ్మెకు ఏఐసీసీ కార్యదర్శి,మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సెగ్గం రాజేష్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సెగ్గం రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత ఔట్సోర్సింగ్,కాంట్రాక్ట్ విధానమే తెలంగాణలో ఉండదని చెప్పిన కేసీఆర్ కేవలం మాటల వారకే పరిమితం చేశారన్నారు. 2019 లో విధుల్లోకి చేర్చుకొని ఇప్పటివరకు పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయకపోవడం బాధాకరమన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఓపియస్ లను రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తిచేసిన ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్‌ను నిర్ధారించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గ్రేట్ 3 గా పరిగణించాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకుంటూ కారుణ్య నియమకాలు




చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మంథని సత్యం,రావికంటి సతీష్,వేల్పుల రాజు,పెంటరి రాజు,మంథని రాకేష్,ఆర్ల నాగరాజు,దొగగోర్ల శ్రీనివాస్‌యాదవ్,ఉట్ల అనిల్‌రెడ్డి,పల్లె రవి,కన్నబోయిన ఓదెలు,ఎరుకల రమేష్‌బాబు,అక్కపాక సదయ్య, జనగమ సడువలి,మంథని సమ్మయ్య, పోరండ్ల రంజిత్,కెక్కర్ల సందీప్,రితీష్, ఇందారపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంపల్లి,మచ్చుపేటలోని పల్లె దవాఖానలకు వైద్యుల నియామకం



ముత్తారం,ఏప్రిల్ 29 మనం న్యూస్ : మండలంలోని ఖమ్మంపల్లి,మచ్చుపేట గ్రామాలలోని పల్లె దవాఖనాలకు వైద్యులను నియమించినట్లు మండల వైద్యాధికారి అమరేంద్రరావు తెలిపారు. శనివారం మండలంలోని ఖమ్మంపల్లి, మచ్చుపేట గ్రామాలలో ఉన్న సబ్ సెంటర్లను శనివారం రోజున వారు బాధ్యతలు తీసుకున్నాట్లు ఆయన తెలిపారు. ఖమ్మంపల్లి కి బియ్యని లావణ్యను,మచ్చుపేటకు బొల్లం దీప్తిలు బాధ్యతలు స్వీకరించారని ఆయన తెలిపారు. పల్లె దవాఖానలో ఒక నుంచి వైద్య సదుపాయం అతిచేరువలో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పదిపది రకం వడ్లను తక్కువధరకు కొనుగోలు చేస్తున్న మిల్లర్లు

### కనీస మద్దతు ధర కరువు

### లబోదిబోమంటున్న రైతులు

వీణవంక- ఏప్రిల్ 29 (మనంనూస్): పదిపది రకం ( వెయ్యిపది,ఒక్కపోస) వడ్ల ను మిల్లర్లు కేవలం క్వింటాల్‌కు 1300 రూపాయలు మాత్రమే చెల్లిస్తామని చెప్పడంతో మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామ రైతులు లబోదిబోమంటున్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దత ధర 2050 రూపాయలు అమలు కావడంలేదని రైతు కృష్ణారావు ఆవేధన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధృవీకరించిన విత్తన షాపులో విత్తన వడ్లు కొన్నానని ,ఎంతో నాణ్యత కలిగిన ఈ విత్తనాలు పంట పండించిన తదుపరి మార్కెట్ లో డిమాండ్ లేదనే చెప్తూ రైతును నిలువునా మిల్లర్లు దోచేస్తున్నారని ఈ విషయమై అధికారులు స్పందించి తమ లాగా పంట పండించిన రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయాలి

### సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రాజిరెడ్డి




ఇల్లందకుంట, ఏప్రిల్29( మనం న్యూస్): గ్రామ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయాలని సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు.జేపీఎస్ ల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఇల్లందకుంట మండల కేంద్రంలో శనివారం సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ ఆరెల్లి జోష్న తో పాటు ఇంచార్జి ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీనియర్ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ న్యాయబద్ధమైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు కష్టపడి పనిచేసి జాతీయ స్థాయిలో అవార్డులు రావడానికి తోడ్పడ్డారన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో సర్పంచులు కలాల రాజిరెడ్డి మొగిలి, ఎల్లారెడ్డి, సాంబయ్య, రాజు, రఫిక్ ఖాన్, వెంకటస్వామి, దిలీప్ రెడ్డి, నాయకులు మట్ట వాసుదేవరెడ్డి, మాదాసు వాసుదేవరావు, మహేందర్, నాగన్న, రాజకొమురయ్య, ఉపసర్పంచులు తిరుపతి, మహేందర్, రవి, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, ఈ పంచాయత్ ఆపరేటర్లు అంజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయండి



సుల్తానాబాద్,ఏప్రిల్ 29 మనం న్యూస్ : శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి సుల్తానాబాద్ మండల నుండి అధిక సంఖ్యలో భక్తులు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయగలరని ఎంపీపీ బాలాజీరావు తెలిపారు.పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి తిరుమల దేవస్థానం వారిచే నిర్వహిస్తున్న సందర్భంగా భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలాజీరావు మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ఆదివారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగబోయే శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి సుల్తానాబాద్ మండలం నుండి భక్తులు సర్పంచులు,ఎంపీటీసీలు,ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.

# సిరిసిల్ల పురపాలక సంఘం సాధారణ సమావేశం


వైస్ చైర్మన్ మంచే శ్రీనివాస్, కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల, ఎప్రిల్ 29, (మనం న్యూస్): సిరిసిల్ల పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని అధ్యక్షురాలు జిందం కళ-చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జిందం కళ మాట్లాడుతూ ప్రజల అవసరాలను, పురపాలక సంఘ పట్టణ అభివృద్ధినీ దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 10 అంశాలను ఈ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా గౌరవ పాలకవర్గ సభ్యులతో చర్చించి 9 అంశాలను ఈ సాదరణ సమావేశంలో ఆమోదించారు. ప్రజలకు ఎలాంటి నీటి సమస్యలు ఏర్పడకూడదని పవర్ బోర్ల రిపేరు, ఫ్లెషింగ్, అవసరం అయినచోట కొత్త మోటర్లు బిగించడం కొరకు ఐదు లక్షల రూపాయల జనరల్ నిధులను కేటాయించాలన్నారు.అదేవిధంగా పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రధాన రహదారులపై చౌరస్తాల అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు.పారిశుధ్య నిర్వహణలో భాగంగా కార్మికులకు అందించుటకు రక్షణ పరికరాల కొనుగోలుకు నిధులు కేటాయించుకుంటూ పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పలు అంశాలపై పాలకవర్గ సభ్యులతో చర్చించుకుని కౌన్సిల్ తీర్మానలు చేశామన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య,

## జిపిఎస్‌ల సమ్మెకు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘీభావం



శంకరపట్నం ఏప్రిల్29( మనం న్యూస్): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శంకరపట్నం మండల కేంద్రంలో మండలానికి చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు శనివారం ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్ న్యాయపరమైనదని రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని వారు ప్రభుత్వాన్ని విన్నవించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శు లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి రాసమల్ల శ్రీనివాస్, మండల కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా ఉపకోశాధికారి నాంపల్లి వెంకటేష్, ఆపరేటర్లు గుర్రం అనుదీప్, తాళ్ళపల్లి ప్రవంతి తదితరులు ఉన్నారు.

## కొత్తపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం



కొత్తపల్లి ఏప్రిల్ 29( మనం న్యూస్): కొత్తపల్లిమున్సిపల్ పట్టణ మున్సిపాలిటి సాధారణ సమావేశము చైర్మన్ రుద్ర రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మంచినీటి సరఫరా చేయాలని, శానిటేషన్ వ్యవస్థ మెరుగుపరిచాలని, డ్రైనేజీ కాలువలను ఎల్లప్పుడూ శుభ్రం చేస్తూ స్వచ్ఛత పాటించాలని మున్సిపల్ చైర్మన్ అధికారులకు సూచించారు. ఇట్టి సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేష్ ,జేరిపోతుల ముండయ్య ,మానుపాటి వేణుగోపాల్ ,గున్నాల విజయ రమేష్, ఎస్కే నజియా బాబా, స్వర్గం వజ్రా దేవి నరసయ్య, చింతల సత్యనారాయణ రెడ్డి వేముల కవితా శేఖర్, కోఆప్షన్ మెంబర్లు ఎండి ఫక్రుద్దీన్, కట్ల మమతా సుధాకర్ మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి స్టడీ సర్కిల్‌లో మహిళల భద్రతపై అవగాహన సదస్సు



సిరిసిల్ల, ఏప్రిల్ 29 (మనం న్యూస్):జిల్లా కేంద్రంలోనీ బిసి స్టడీ సర్కిల్ లోని విద్యార్థినులకు శనివారం షీటీం ఆధ్వర్యంలో మహిళా భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, షిటీం ఎస్సై ప్రేమ్‌దీప్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ తెలిసి తెలియని తప్పులు చేస్తూ జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. పొరపాటున జరిగే తప్పులకు జీవితకాలం బాధ పడల్సి వస్తుందన్నారు. సోషల్ మీడియాని ఎక్కువ గా వాడుతున్న వారు తెలియని వాళ్ళతో ఎలాంటి సంభాషణ చేయవద్దు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం సిరిసిల్ల డివిజన్ ఇంచార్జీ ఇల్లందుల ప్రకాష్, షి టీం సిబ్బంది,బిసి స్టడీ సర్కిల్ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

### ఎంపిపి వినీత



చిగురుమామిడి, ఏప్రిల్ 29 (మనం న్యూస్): కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉంటేనే గ్రామాల నుంచి పట్టణాల వరకు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని చిగురుమామిడి ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గునుకుల పల్లె గ్రామంలో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా అభివృద్ధిలో పాలుపంచుకున్నప్పుడే అభివృద్ధి చెందుతుందని, ఇందుకు నిదర్శనమే గునుకులపల్లి గ్రామమని తెలిపారు. ఈ సందర్భంగా ఇందుర్తి గ్రామ అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు బాబు గునుకుల పల్లె గ్రామంలో తమకు వ్యవసాయ భూములున్నాయని, 50, 70 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూముల్లో తమకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని వినతి పత్రం అందజేశారు. ఇందుర్తి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ అందే భూలక్ష్మి పరుశరాములు గునుకుల పల్లిలో రేషన్ షాప్ నిర్వహించడానికి స్థలం ఇప్పించాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సయ్యద్ మోబిన్ అహ్మద్, ఎంపిడివో నరసయ్య, గ్రామ సర్పంచ్ గునుకుల అమూల్య మధుసూదన్ రెడ్డి, ఉపసర్పంచ్ కూన పోశయ్య, వార్డు సభ్యులు లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదే రఘునాథ్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శైలజ, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, ఏఈఓ సతీష్, ఏఎన్ఎం కవిత, వీఆర్‌ఏ శ్రీకాంత్, దళిత సంఘ నాయకులు అందే బాబు, పోశయ్య, పరుశరాములు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి ఐక్యతకు అందరం కృషి చేయాలి

### జిల్లా అధ్యక్షులు మెతుకు సత్యం

కరీంనగర్ కలెక్టరేట్,ఏప్రిల్29 (మనంన్యూస్): పద్మశాలీల ఐక్యత కోసం అందరూ కృషి చేయాలని, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు మెతుకు సత్యం, గౌరవ అధ్యక్షులు వాసాల రమేష్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో శనివారం జిల్లా కార్యవర్గం తో పాటు అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో పద్మశాలీలు ఐక్యతను చాటుకుని రాజకీయంగా ఎదగాలన్నారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం పేరుతో కొంతమంది వ్యక్తులు చేపడుతున్న సభ్యత్వాలకు జిల్లా పద్మశాలి సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. జిల్లా పద్మశాలి సంఘంతో నిమిత్తం లేకుండా మండలాల వారిగా సభ్యత్వాలు నమోదు చేస్తున్నారని, అట్టి సభ్యత్వాలు ఉన్నవారు జిల్లా పద్మశాలి సంఘానికి ఇలాంటి సంబంధం లేదన్నారు.జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వాలు తీసుకునేవారు అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులకు సభ్యత్వ నమోదు బుక్స్ ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆసక్తిగల కుల బాంధవులు వారి ద్వారా సభ్యత్వము కొరకు 500 రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యులుగా నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ సంఘం బలోపితం కోసం ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం అనుబంధ సంఘాల అధ్యక్షులు గడ్డం శ్రీరాములు, పోలు సత్యనారాయణ, గుడిమల్ల శ్రీకాంత్ జిల్లా నాయకులు రుద్రరాజు, అలుసభద్రయ్య, వోడ్నాల రవీందర్, స్వర్గం నరసయ్య, చక్కని ప్రభాకర్ సబ్బని రాజేందర్, మంచికట్ల కోటేశ్వర్, తిరుమల జయేందర్, వంగర రవీందర్, చిలక నరసప్ప వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# పంచాయితీ కార్యదర్శుల నిరసన దీక్షకు బొమ్మ శ్రీరామ్ మద్ధతు

చిగురుమామిడి, ఏప్రిల్ 29 (మనం న్యూస్): సమస్యల పరిష్కారం కోరుతూ జూనియర్ పంచాయితీ కార్యదర్శులు చేపట్టిన నిరసన దీక్షకు బిజెపి హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తితో పాటు మండల పార్టీ నాయకులు మద్ధతు ప్రకటించారు. శనివారం బిజెపి నాయకుల తో కలిసి బొమ్మ నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాలు విధులు నిర్వహిస్తోన్న పంచాయితీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందని ప్రశ్నించారు. పంచాయితీ కార్యదర్శుల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్‌గా పరిగణిస్తూ వారిని తక్షణమే రెగ్యులరైజ్ చేసే విధంగా జివో జారీ చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్యదర్శుల కుటుంబ సభ్యులను కారుణ్య నియామకాల కింద ఉద్యోగాల్లోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు పంచాయితీ కార్యదర్శుల వెంటే ఉంటుందని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి మండల బిజెపి అధ్యక్షులు దుడ్డేల లక్ష్మి నారాయణ, ప్రధాన కార్యదర్శి పైడిపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బోయినీ వంశీ కృష్ణ, వంగర మల్లేశం, సోషల్



మీడియా కన్వీనర్ బోయిని ప్రశాంత్, కొండాపూర్ ఉపసర్పంచ్ మట్ట శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవీందర్ రెడ్డి, గందె చిరంజీవి, పడాల శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో అల్ఫోర్స్‌కు ర్యాంకుల పంట

కరీంనగర్, ఏప్రిల్ 29 (మనం న్యూస్): శనివారం ప్రకటించిన ఐఐటి జెఇఇ మెయిన్స్ 2023 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. వివిధ క్యాటగిరీల్లో నిర్వహించిన పరీక్షల్లో జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి మరోసారి అల్ఫోర్స్ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలకు చెందిన పి. రాకేశ్ అనే విద్యార్థి 12వ ర్యాంకుతో గతంలో సాధించిన 18వ ర్యాంకును అధిగమించి అత్యున్నత స్థానంలో నిలిచాడు. అలాగే బి. మారుతి 228 వ ర్యాంకు, ఏ. ఇషాంత్ రెడ్డి 250 వ ర్యాంకు, యమ్. అభిరామ్ 448, అర్. సుహాసిత రెడ్డి 480, గంగం సాత్విక్ 511 వ ర్యాంకు, పి. హర్షవర్ధన్ 520, కె.రాహుల్ 554, యమ్.అరుణ్ 624, ఏ. శివసాయిచరణ్ 634, వై. శివమణి 680, డి.వివేకవర్ధన్ 748 , బి.రాజుకుమార్ 805, బి.శ్రీనివాస్ 939 ర్యాంకులు సాధించి అల్ఫోర్స్‌కు ర్యాంకుల పంట పండించారు. యమ్. అభిరామ్ అనే విద్యార్థి ఫిజిక్స్ లో వందకు 100 మార్కులు సాధించి వంద పర్సంటైల్ సాధించడం అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం.వీరేగాకుండా వెయ్యిలోపు 14 ర్యాంకులు, 5వేల లోపు 40 ర్యాంకులు, పది వేల లోపు 70 ర్యాంకులు సాధించారు. మొత్తం ఈ విద్యాసంస్థకు చెందిన 450 మందికి పైగా విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హత సాధించడం మరో సంచలనంగా మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఐఐటి అడ్వాన్స్డ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు దేశంలోనే అత్యుత్తమ ఉపాధ్యాయ బృందంతో ఉచిత శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. పటిష్ట ప్రణాళికతో విద్యా భోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల అహర్నిషల కృషివల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగిందన్నారు. రాబోయే అడ్వాన్స్డ్ పరీక్షలో కూడా తమ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని నరేందర్ రెడ్డి అభినందించారు.










## అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



మల్లాపూర్ ఏప్రిల్ 29 ( మనం న్యూస్ ): మండలం లోని సాతారం గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్రాలకు వచ్చే పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు .గర్భిణీలకు, చిన్నపిల్లల తల్లులకు అంగన్వాడి కేంద్రాల గురించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు భారత, శంకరమ్మ, మండలంలోని అన్ని అంగన్వాడి సెంటర్ల టీచర్లు పాల్గొన్నారు.

## రాజన్న సేవలో హుషారు సినిమా హీరో, డైరెక్టర్



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 29, (మనం న్యూస్): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం హుషారు చలనచిత్రం హీరో దినేష్ తేజ్, డైరెక్టర్ మేక సూరి దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ ఆంజనేయస్వామి మాలధారణ వేసుకున్న క్రమంలో దైవదర్శనాలలో భాగంగా వేములవాడ ఆలయాన్ని సందర్శించి, స్వామి వారిని దర్శించుకోవడం జరిగిందని అన్నారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం చేసి, స్వామివారి లడ్డూప్రసాదాలను అందజేశారు. వారి వెంట స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ గోలి మహేష్, తదితరులు ఉన్నారు.

# జీవన్ రెడ్డి రాజకీయ నిబద్ధత ఏమిటో కెసిఆర్‌ను అడిగి తెలుసుకో

### ఆయనను విమర్శించే నైతికత సుంకెకు లేదు

### ఎమ్మెల్యే రవిశంకర్ వ్యాఖ్యలపై అడ్లూరి ఫైర్

జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 29 (మనం న్యూస్ ): ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీవన్ రెడ్డి రాజకీయ నిబద్ధత ఏమిటో సుంకె రవిశంకర్ ముఖ్యమంత్రి కెసిఆర్ ను అడిగి తెలుసుకోవాలని జగిత్యాల డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు అర్థం చేసుకోకుండా ఆయనపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో దళితుల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేసిందన్నారు. దళిత బంధు పథకంలో ఎమ్మెల్యేలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని స్వయానా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపైనే జీవన్ రెడ్డి మాట్లాడారని తెలిపారు. దళితులకు కేటాయించిన నిధులను ఎందుకు వారి కోసం ఖర్చు చేయలేని జీవన్‌రెడ్డి ప్రశ్నిస్తే రవిశంకర్ ఎందుకు ఉలికిపడుతున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉన్న సుంకె ఆయన స్థాయికి తగ్గట్లుగా వ్యవహరించడంల లేదని, పచ్చి అబద్ధాలు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ మేడిపెల్లి సత్యం మాట్లాడుతూ ఆరెస్సెస్ నుంచి ఆర్ఎస్‌యు వరకు కమ్యూనిస్టుల నుంచి కాంగ్రెస్ పార్టీ వరకు అన్ని పార్టీలు, వర్గాల నాయకులు, ప్రజలు ఆదరించే ఒకే ఒక వ్యక్తి జీవన్ రెడ్డి అన్నారు. కులమతాలకు అతీతంగా గౌరవింపబడుతున్న జీవన్ రెడ్డిపై రవిశంకర్ స్థాయి మరిచి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఏర్పడ్డ అభద్రతాభావంతో జీవన్ రెడ్డిపై అనవసరపు వ్యాఖ్యలకు పాల్పడుతున్నారన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన జీవన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేసే నైతికత రవిశంకర్‌కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు చేసిందేమిటని ప్రశ్నిస్తున్న వారు ముందు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమిటో తెలుపాలన్నారు. దళితున్ని ముఖ్యమంత్రి చేసింది, ఏఐసిసి అధ్యక్షునిగా దళితున్ని నియమించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఈ సమావేశంలో టిపిసిసి నేత బండ శంకర్, కౌన్సిలర్లు దుర్గయ్య, నక్క జీవన్, నాయకులు మన్సూర్, మున్న, గుండా మధు, బీరం రాజేష్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరసన దీక్ష




జమ్మికుంట, ఏప్రిల్ 29 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని, గత నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ గా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శనివారం జమ్మికుంట ఎంపీడీవో కార్యాలయం ముందు మండల పరిధిలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంత్ ని నిర్ధారిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలన్నారు. మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. 317 జీవో వలన నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని, పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసన దీక్షలు కొనసాగిస్తామన్నారు.

# పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి

**- తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయరాదు**

**- మంథని ఎస్ఐ వెంకటేశ్వర్లు**

మంథని,ఏప్రిల్ 29 మనం న్యూస్ : మంథని పట్టణంలోని జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్ ఆవరణలో శనివారం తల్లిదండ్రులతో సైబర్ క్రైమ్ అవేర్నెస్ కార్యక్రమం మంథని ఎస్ఐ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకి స్మార్ట్ ఫోన్స్ ఇచ్చినప్పుడు తగు జాగ్రత్తలు సూచించాలన్నారు. అనవసరంగా తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయరాదని వారి యొక్క ఫోటోలు,ఇతర ఐడి ప్రూఫ్ గానీ అనవసరంగా ఎవరికీ పంపించకూడదన్నారు. ఫోన్ పే,గూగుల్ పే లాంటి అకౌంట్ నెంబర్లతో ఉన్న మొబైల్ నెంబర్స్ వాడటం వల్ల ఇతర యాప్‌లలో వచ్చేనోటిఫికేషన్ తెలిసి తెలియకుండా క్లిక్ చేయడంతో కొంతమంది డబ్బులు లాస్ అయిపోతున్నారని అన్నారు. వేసవికాలంలో పిల్లలు ఇంట్లోనే ఉంటారని తల్లిదండ్రులు పిల్లలతో మంచి స్నేహపూర్వకంగా ఉండి ఎటువంటి  సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఎస్ఐ వెంకటేశ్వర్లు,హెడ్ కానిస్టేబుల్ దుర్గా దాస్,సురేందర్,మహేందర్,సంతోష్‌లు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వర కళ్యాణోత్సవం విజయవంతం చేయాలి

### ఎంపీపీ నూనెటి సంపత్‌యాదవ్



కాల్వశ్రీరాంపూర్,ఏప్రిల్ 29 మనం న్యూస్ : శ్రీ వెంటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి  కాల్వశ్రీరాంపూర్ మండలం నుండి అధిక సంఖ్యలో భక్తులు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయగలరని ఎంపీపీ నువ్వు నేటి సంపత్ యాదవ్ తెలిపారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి స్వామి కళ్యాణ మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే నిర్వహిస్తున్న సందర్భంగా కాల్వశ్రీరాం పూర్ ప్రజలు భగవంతుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్ మాట్లాడుతూ మొదటిసారిగా ఆదివారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగబోయే శ్రీ వెంకటేశ్వర స్వామి క ళ్యాణ మహోత్సవానికి  కాల్వశ్రీరాంపూర్ మండలం నుండి భక్తులు సర్పంచులు,ఎంపీటీసీలు,ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలి.

## అంటకారితనం నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**ధర్యాపూర్‌లో పౌరహక్కుల దినోత్సవంలో ఎస్ఐ బేతి రాములు**



ముత్తారం,ఏప్రిల్ 29 మనం న్యూస్ : అంగరానితనం నిర్మూలించేందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని ముత్తారం ఎస్ఐ బేతి రాములు అన్నారు. శనివారం మండలంలోని ధర్యాపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవ వేడుకల్లో ఆయన రెవెన్యూ అధికారులతో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో కులవివక్ష చూపుతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కులం పేరుతో దేవాలయాల్లోకి అనుమతించకుండా గ్రామీణ ప్రాంతాలలో కులం పేరుతో దుసిస్తే నేరమని తెలియక చాల మంది కేసులపాలవుతున్నారని అన్నారు. చదువుకున్న యువత కులవ్యస్తాపై చదువురాని వారికి అవగాహణ కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గాదం స్రవంతి శ్రీనివాస్,ఆర్ఐ రాజిరెడ్డి,జూనియర్ అసిస్టెంట్ మధున్మోహన్,హెడ్ కానిస్టేబుల్స్ మధునయ్య, మల్లేష్,విద్యాశాఖ అధికారులతో పాటు కనిస్టేబుల్ అశోక్,తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కార్యదర్శుల సమ్మెకు నాయకుల మద్దతు




వీణవంక– ఏప్రిల్ 29 (మనంనూస్): గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులు వారి డిమాండ్ల  సాధన కొరకు శనివారం మండలకేంద్రంలో  సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు  మండలంలోని  వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువజన సంఘాలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా  కార్యదర్శులు మాట్లాడుతూ  మూడు సంవత్సరాల కాల పరిమితి అనంతరం రెగ్యులరైజేషన్ చేస్తామని  ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి  కెసీఆర్  నేటికి నెరవేర్చలేదని  అన్నారు. ఎంతో  పని భారం ఉన్నా కూడా  ఓర్చి  ప్రజలకు సేవచేస్తున్నామని  అయినా ప్రభుత్వం తమ పట్ల మొండి వైఖరి  అవలంభిస్తుందని అన్నారు.  తమ డిమాండ్లు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని అన్నారు.  ఈ కార్యక్రమంలో శ్రీరాములపేట గ్రామ సర్పంచ్ కొల్లూరి సంధ్యబాపురావు, మండల కాంగ్రెస్  పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహ్మద్ సాహెబ్‌హుస్సేన్, నాయకులు గంగాడి రాజిరెడ్డి, చదువు జైపాల్‌రెడ్డి, మండల రాజయ్య, ఎండి.రజాక్,అన్వర్, పలు యువజనసంఘాల నాయకులు ,కార్యదర్శులు దాసరి వీరప్రతాప్, అజయ్, మహిపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, రవూఫ్, కృపారాణి,  ,సంపత్ తదితరులు పాల్గొన్నారు.